సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం, 19, మే, 2023



సప్లిమెంటరీకి సన్నద్ధం

ఇంటర్ సప్లిమెంటరీకి అధికారులు సన్నద్ధమవుతున్నారు. 24 నుంచి పరీక్షలు మొదలవుతాయి.

- 8లో



అంగన్‌వాడీ పోస్టులకు..

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ పడింది. ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలి.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	23°
ఇచ్ఛాపురం	35°	25°
పాతపట్నం	35°	24°
శ్రీకాకుళం	35°	23°

న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు 2022-23 విద్యాసంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాల లేదా గుర్తింపుపొందిన పాఠశాలలో 10వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష జూలై 22న నిర్వహిస్తామని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు కేంద్రాల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 (ఏపీ ఈఏపీ సెట్) కొనసాగుతోంది. మూడు కేంద్రాల్లో గురువారం హాజరు పరిశీలిస్తే టెక్కలి ఐతంలో మొదటి షిఫ్టులో 232కి 225, రెండో షిఫ్టులో 232కి 224, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 190 కి 184, రెండో షిఫ్టులో 190కి 185, చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 190కి 185, రెండో షిఫ్టులో 190 కి 181 మంది హాజరయ్యారు. సెట్‌ను ప్రత్యేక పర్యవేక్షకులు పరిశీలించారు.

రాష్ట్ర పోటీలకు పయనం



రాష్ట్రపోటీలకు ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులతో కె.శ్రీధర్‌రావు, కోచ్ ఉమ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర పోటీల్లో తుది వరకు పోరాడి విజయబావుటా ఎగురవేయాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. విశాఖపట్నం జిల్లా రైల్వే స్టేడియం వేదికగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్ర యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల బృందం గురువారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. వీరి ఎంపికలను ఈనెల 17వ తేదీన శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా నిర్వహించిన విషయం విదితమే.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులలో 48 కేజీల విభాగంలో కె.కృష్ణ, 57 కేజీల విభాగంలో జి.మధు, 63.5 కేజీల విభాగంలో ఎస్.వేణుమాధవ్, 75 కేజీల విభాగంలో కె.హరీష్, 80 కేజీల విభాగంలో జి.ఢిల్లేశ్వరరావు, 86 కేజీలు విభాగంలో టి.పూర్ణచంద్రరావు, బాలిక 48 కేజీల విభాగంలో జె.స్రవంతి ఎంపికైన వారిలో ఉన్నారని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కార్యదర్శి బలగ అనంతలక్ష్మణ్ దేవ్(అను) తెలిపారు. క్రీడాకారుల వెంట డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వర ఉన్నారు.

ఏపీ గురుకులాల ప్రవేశ పరీక్ష రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు/ జూనియర్/ డిగ్రీ కళాశాలల ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎం పురం ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా పరీక్షలు నిర్వహణ సమన్వయకర్త పి.శ్రీనివాసరావు చెప్పారు. పాఠశాలలో గురువారం వివరాలు వెల్లడించారు. 20వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశానికి, మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటలు వరకు ఇంటర్మీడియెట్, డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష సమయానికి గంట ముందు నుంచి పరీక్ష కేంద్రానికి అనుమతించనున్నట్లు వివరించారు. విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఏఎస్.ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఐరిష్ ద్వారా నిత్యావసరాల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేలిముద్రలు పడని వారికి ఐరిష్ ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి డీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. చాలా మంది వృద్ధులు వేలిముద్రలు పడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి అలాంటి వారికి ఐరిష్ ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. కనుపాప (ఐఆర్ఐఎస్) సమాచారాన్ని ఆధార్ కనుపాప సమాచారంతో ధ్రువీకరించి నిత్యావసరాలను పంపిణీ చేసేందుకు ఆధునిక ప్రమాణాలతో కూడిన ఐఆర్ఐ రీడర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సరఫరా చేస్తామని తెలిపారు.

● మహానాడుకు మొహం చాటు

కుర్చీలు ఫుల్.. జనం నిల్

బాదుడే బాదుడు కార్యక్రమం పేరుతో పొందూరు మండలం దళ్లవలసకు టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హాజరైన దృశ్యమిది. పార్టీకి మంచి ఊపు వచ్చిందని.. జనాలంతా టీడీపీవైపే ఉన్నారంటూ చంద్రబాబు హడావుడి చేసిన సందర్భమిది. కానీ, అప్పట్లో ఆ సభకు జనాల్లేక కుర్చీలు వెలవెలబోయాయి. ప్రాంగణమంతా ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. సాక్షాత్తు చంద్రబాబు హాజరైన సభకొచ్చిన దుస్థితి ఇది.



టీడీపీ శక్తియుక్తులన్నీ ఉపయోగించి, జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ మినీ మహానాడు సభ ఇది. టీడీపీ పెద్దలంతా హాజరైన సభకు భారీగా జన సమీకరణ చేశారు. జనం అదే ట్రీట్‌మెంట్ ఇచ్చారు. అధికారంలో ఉండగా మేలు చేయని పార్టీ...మళ్లీ ఏదో చేస్తుందని ఎలా నమ్మగలమంటూ ప్రజలే కాదు ఆ పార్టీ శ్రేణులు కూడా మొఖం చాటేశాయి. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా వెలవెలబోయాయి. జనం లేక చాలా సేపు సభను ప్రారంభించలేని పరిస్థితిని టీడీపీ ఎదుర్కొంది.



- మినీ మహానాడుకు హాజరు కాని జనం
- బోసిపోయిన సభా ప్రాంగణం
- కొద్ది పాటి జనాలను తీసుకొచ్చిన గొండు శంకర్, మామిడి గోవిందరావుకు అవమానం
- వేదికపైకి పిలవకుండా కిందనే కూర్చోమన్న జిల్లా నాయకత్వం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అటు చంద్రబాబు హాజరైన సభ, ఇటు టీడీపీ జిల్లా కేడర్ అంతా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మినీ మహానాడు సభ చూస్తే టీడీపీకి అంత సీన్ లేదని స్పష్టమవుతోంది. తమకు వాపు తప్ప బలం లేదనే విషయం టీడీపీ కేడర్‌కు, ఆ పార్టీ శ్రేణులకు బోధపడుతోంది. బయట ఎంత హంగామా, హడావుడి చేసినా.. జనాల్లోనే కాదు టీడీపీ సానుభూతి పరుల్లో కూడా ఆదరణ లేదని విషయం అర్థమయ్యేలా గత ఏడాది చంద్రబాబు సభ, ఈ ఏడాది మినీ మహానాడు సభ తేటతెల్లం చేసింది. నమ్మినోళ్లను మోసగించడమే తప్ప చేసిందేమీ లేకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందనే వాదన జిల్లా వ్యాప్తంగా వినిపిస్తోంది.

ఎందుకీ పరిస్థితి..?

ఓట్లేసిన ప్రజల్నే కాదు పార్టీని నమ్ముకుని పనిచేసే నాయకులకు కూడా విలువ లేకపోవడంతోనే టీడీపీకి ఈ దుస్థితి అని ఆ పార్టీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి. అధికారంలో ఉన్నంత సేపు ప్రజల్ని మోసగించాం, కష్టపడి పనిచేసే కేడర్‌ను నియంతృత్వ పోకడతో ఇబ్బంది పెడుతున్నాం, ఇక సభలకు, సమావేశాలకు జనాలు, పార్టీ శ్రేణులు ఎందుకొస్తారు, ఎవరు తీసుకొస్తారనే వాదన ఆ పార్టీలోనే మొదలైంది. వాస్తవంగా టీడీపీ మినీ మహానాడును భారీ జన సమీకరణతో నిర్వహించాలని జిల్లా నాయకత్వం భావించింది. అందుకు తగ్గ సన్నాహాక సమావేశాలు కూడా నిర్వహించుకుంది. ఎవరెవరు ఎక్కడెక్కడ నుంచి ఎంతమందిని తీసుకురావాలి అనేదానిపై ప్లాన్ చేసుకున్నారు. కానీ, వారి వ్యూహాలు బెడిసికొట్టాయి. ప్రజలే కాదు టీడీపీ సానుభూతి పరులు కూడా ఆసక్తి చూపలేదు. మినీ మహానాడుకు ముఖం చాటేశారు. ప్రజల నుంచి స్పందన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని టీడీపీ శ్రేణులు విశ్లేషించుకుంటున్నాయి. ఎన్ని ఏర్పాట్లు చేసినా, ఎంత హడావుడి చేసినా స్పందన లేకపోవడం చూసి ఇంతవరకు తమకున్నది వాపే తప్ప బలుపు కాదనే విషయం స్పష్టమవుతోందని పలువురు చర్చించుకున్న పరిస్థితి కన్పించింది.



గొండు, మామిడిలకు అవమానం

శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల నుంచి టికెట్ రేసులో ఉన్న గొండు శంకర్, మామిడి గోవిందరావు, కలిశెట్టి అప్పలనాయుడే ప్రస్తుతం పార్టీలో యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. తమకు టిక్కెట్ వస్తుందన్న ఆశతో భారీగా ఖర్చు పెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ, పార్టీ అధిష్టానం గానీ, జిల్లా నాయకత్వం గానీ గుర్తించడం లేదు. అయినప్పటికీ ఏదో ఒక రోజున పార్టీ గుర్తించక మానదా అని లక్షలు ఖర్చు పెట్టి, పార్టీ ఫండ్ కింద లక్షలాది రూపాయలిచ్చి ప్రజల్లో ఉంటున్నారు. ఎంతో కొంతమందిని తమవైపు తిప్పుకుని పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీరిని కూడా జిల్లా నాయకత్వంతో పాటు అధిష్టానం తరచూ అవమానాలకు గురి చేస్తోంది. కరివేపాకులా గొండు శంకర్‌ను శ్రీకాకుళం నియోజకవర్గంలో తీసిపారేస్తుండగా, పాతపట్నంలో యూజ్ అండ్ త్రో మాదిరిగా పార్టీ కోసం ఖర్చు పెట్టించుకుని మామిడి గోవిందరావును వదిలేస్తున్నారు. ఇక, ఎచ్చెర్లలో కలిశెట్టి అప్పలనాయుడు పరిస్థితి చెప్పనక్కర్లేదు. కాకపోతే, కాశీకి వెళ్లడం వలన కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం మినీ మహానాడుకు హాజరు కాలేదు. అదే ఆయనకు అదృష్టమని చెప్పాలి. లేదంటే తీవ్ర అవమానానికి గురయ్యేవారేమో!.

వేదికపైకి పిలవరా..?

టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మినీ మహానాడుకు అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడు తదితర కీలక నేతలు రావడంతో తమ బలం చూపించి, అధిష్టానం మెప్పు పొందుదామని భావించిన గొండు శంకర్‌కు, మామిడి గోవిందరావుకు తీవ్ర అవమానమే ఎదురైంది. కార్యక్రమం కోసం భారీగా ఫ్లెక్సీలను దారి పొడవునా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా తమ బలం చూపుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించి తమ వెంట వచ్చిన జనాన్ని తీసుకొచ్చారు. కానీ, జిల్లా నాయకత్వం వీరిని కనీసం గుర్తించలేదు. పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టి, కార్లతో శ్రేణులను తీసుకొచ్చిన గొండు శంకర్‌ను, మామిడి గోవిందరావును వేదికపైకి పిలవలేదు. కిందనే కూర్చోమని హుకుం జారీ చేశారు. దీంతో గొండు శంకర్, మామిడి గోవింద వెంట వచ్చిన టీడీపీ శ్రేణులు ఒక్కసారి షాక్‌కు గురయ్యారు. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులను వాడుకుని వదిలేస్తారా? అని ఒక్కసారిగా వారి అనుచరులు అంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. వచ్చిన కొద్దిపాటి కార్యకర్తలు కూడా వెళ్లిపోవడంతో మినీ మహానాడు సభా ప్రాంగణమంతా ఖాళీ కుర్చీలతో బోసిపోయింది. గొండు శంకర్‌కు, మామిడి గోవిందరావుకే కాకుండా టీడీపీకి అవమానకరంగా సభ సాగింది.

‘జగనన్నకు చెబుదాం’కు

స్పందన భేష్



సచివాలయం వద్ద ఫిర్యాదు చేసిన వ్యక్తి పాశాల జగదీష్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఈ భాస్కర్

కంచిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమానికి స్పందన భేష్‌గా ఉంది. మండలంలోని జాతీయ రహదారి నుంచి పెద్దకొజ్జిరియా గ్రామం మీదుగా సహలాలపుట్టుగ గ్రామం వరకు 3.19 కిలోమీటర్లకు ఏఐబీ నిధులు రూ.131.81లక్షలతో రోడ్డును టీడీపీ హయాంలో మంజూరు చేశారు. 2019 జనవరి 24వ తేదీన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత కాలంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. కేవలం రోడ్డు నిర్మాణంలో మెటల్ వేసి విడిచిపెట్టేశారు. దీంతో ఆ రోడ్డు మార్గంలో ప్రయాణించాలంటేనే స్థానికులు హడలెత్తిపోతున్నారు. ఎన్నోసార్లు స్థానికులు అధికారులకు చెప్పినప్పటికీ స్పందనలేదు. చివరికి ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని నిర్ణయించుకొన్నారు. పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన పాశాల జగదీష్ వారం రోజుల కింద ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమానికి 1902కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. దీంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న పీఐఏ ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులకు సీఎం పేషీ నుంచి తాఖీదు అందడంతో, మండల ఇంజినీరింగ్ అధికారి భాస్కర్‌ను జాడుపూడి సచివాలయానికి పంపించి, ఫిర్యాదు చేసిన వ్యక్తి జగదీష్‌ను పిలిపించి, సమస్యను నిశితంగా పరిశీలించారు. అంతేకాకుండా జిల్లాస్థాయిలో పీఐఏ విభాగం అధికారులు గురువారం నిర్వహించిన సమావేశంలో కూడా ఈ సమస్యపైన చర్చించినట్లు పీఐఏ విభాగం ఏఈ ధనుంజయ ‘సాక్షి’తో చెప్పారు.



దుమ్ము ఎగసిపడుతున్న పెద్దకొజ్జిరియా రహదారి



రోడ్డు నిర్మాణానికి టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ వేసిన శిలాఫలకం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇలాంటి రోడ్లన్నింటిపైనా నివేదిక ఇచ్చానని, ఈ పనులు చేపట్టే విశ్వసముద్ర ఇంజినీరింగ్ కంపెనీతో చర్చించడానికి జిల్లా అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. పెండింగ్ రోడ్డు నిర్మాణ పనులన్నింటికి కదలిక వచ్చినట్లు వెల్లడించారు.

విదేశీ విద్యా దీవెన పథకానికి దరఖాస్తుల స్వీకరణ



శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఆర్థిక సాయం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ సంస్థ డీడీ ఇన్‌చార్జి ఆర్.గడ్డెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ప్రపంచంలో ఉన్న టాప్ 200లోపు క్యూఎస్ వరల్డ్ ర్యాంకుల్లో ఉన్న విదేశీ విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదవాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. ఈ వర్గాలకు చెందిన 35 ఏళ్ల లోపు వారు జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ, పీజీ, ఇంటర్‌లలో 60 శాతం, తత్సమాన గ్రేడ్‌లను పొంది ఉండాలని, ఆయా కోర్సులకు అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచంలో టాప్ 100 లోపు ర్యాంకు గల విశ్వవిద్యాలయాలు/ విద్యా సంస్థల్లో ప్రవేశం పొందితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వమే 100 శాతం లేదా రూ.125 లక్షలు ఫీజు ఏది తక్కువైతే అది చెల్లిస్తుందని తెలిపారు. ఇతర వర్గాలకు రూ.100 లక్షలు వరకు ఏది తక్కువైతే అది, 101 నుంచి 200లోపు ర్యాంకు కలిగిన వాటిలో అడ్మిషన్ పొందితే ప్రభుత్వమే 100 శాతం లేదా రూ.75 లక్షలు ఫీజు ఏది తక్కువైతే అది, ఇతర వర్గాలవారికి 50 శాతం ఫీజు లేదా రూ.50 లక్షలు ఏది తక్కువైతే ఆ ఫీజును ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ పదో తేదీలోగా http:// jnanabhumi.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానున్నాయని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్ రామన్ తెలియజేశారు. ఈ మేరకు ఉదయం 2వ స్థాయీ, 4వ, 7వ స్థాయీ సమావేశాలు, అలాగే మధ్యాహ్నం నుంచి 1వ స్థాయీ, 6వ, 3వ, 5వ సంఘ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘ చైర్మన్లు అధ్యక్షత వహించనున్నారని, కాగా స్థాయి కమిటీల సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

నడిరేయి బీభత్సం



టెక్కలిలో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

- బుధవారం అర్ధరాత్రి గాలివాన విధ్వంసం
- తీర ప్రాంత నియోజకవర్గాలపై తీవ్ర ప్రభావం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- అరటి, బొప్పాయి, కర్బూజా పంటలకు దెబ్బ
- భారీగా నేలరాలిన మామిడి
- రూ.2కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: చిమ్మ చీకటిలో గాలివాన విధ్వంసం సృష్టించింది. నడిరేతిరి పిడుగులు, ఉరుములతో సిక్కోలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. వర్షంతో కూడిన ఈదురుగాలులు రైతులకు అకాల నష్టం తెచ్చిపెట్టాయి. విద్యుత్ శాఖకు సైతం నష్టం సంభవించింది. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.2కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో రవాణాతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు సకాలంలో స్పందించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జిల్లాలో కొన్ని రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకి ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు బయటకి రాలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి దాటాక అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. అర్ధరాత్రి దాటాక భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఉష్ణోగ్రత తగ్గి కాస్త చల్లబడింది. ఈదురుగాలులు తెచ్చిన నష్టం మాత్రం ఎక్కువే.

విద్యుత్ శాఖకు దెబ్బ..

గాలి వాన దెబ్బ విద్యుత్ శాఖపై గట్టిగానే పడింది. రూ.55.50లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు 33కేవీ ఫీడర్స్ 55వరకు, 11కేవీ ఫీడర్స్ 277, 11కేవీ విద్యుత్ స్తంభాలు 93, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 108 వరకు దెబ్బతిన్నాయి. వీటిలో చాలా వరకు కూలిపోయాయి. శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్‌లో ఈ నష్టం సంభవించింది. ఎక్కడికక్కడ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు పెద్ద ఎత్తున అంతరాయం ఏర్పడింది. అయితే ట్రాన్స్‌కో అధికారులు సకాలంలో స్పందించి, వాటి మరమ్మతు పనులు చేపట్టడంతో దాదాపు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గురువారం మధ్యాహ్నం సమయానికి ఒక 33కేవీ ఫీడర్, ఐదు 11కేవీ ఫీడర్లు, 11కేవీకి చెందిన 42 విద్యుత్ స్తంభాలు, ఎల్‌టీకి చెందిన 54 స్తంభాలకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంది. సాయంత్రానికి దాదాపు మరమ్మతు పనులు పూర్తి చేశారు. డివిజన్‌ల వారీగా చూస్తే శ్రీకాకుళం డివిజన్‌లో రూ.15.45లక్షలు, టెక్కలి డివిజన్‌లో రూ.35.50 లక్షలు, పాలకొండ డివిజన్‌లో రూ.4.55లక్షలు నష్టం జరిగింది.

తీర ప్రాంతంలో..

భారీ ఈదురుగాలులకు తీర ప్రాంత నియోజకవర్గాల్లో ఊహించని నష్టం సంభవించింది. టెక్కలి, నరసన్నపేట, ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాలతో పాటు ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో ప్రభావం చూపాయి. ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి, మామిడి పంట చాలావరకు నేలరాలిపోయింది. అరటి, బొప్పాయి, కర్బూజా తోటలు ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ మూడు పంటలు దాదాపు 162.44 హెక్టార్లలో రూ.కోటి 49లక్షల 14వేలకు పైగా నష్టపోయాయి. అకస్మాత్తుగా వచ్చిన గాలివానతో రైతులకు అకాల నష్టం వాటిల్లింది. ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమే. మరికొన్ని ప్రాంతాలకు సంబంధించిన నష్టాల వివరాలు రావాల్సి ఉంది. 139.54 హెక్టార్లలో అరటి, 12.50 ఎకరాల్లో బొప్పాయి, 10 ఎకరాల్లో కర్బూజా నష్టం సంభవించినట్టు అధికారుల ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి.



గార: బూరవెల్లిలో కూలిన అరటి చెట్లు



సారవకోట: కిడిమిలో నేలరాలిన మామిడి

రైలు ఢీకొని 38 గొర్రెలు మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జయరామచంద్రపురం గ్రామంలో గురువారం రైలు ఢీకొని 38 గొర్రెలు దుర్మరణం పాలయ్యాయి. గ్రామానికి చెందిన కిక్కర సోమేశ్వరరావు, అప్పారాలకు చెందిన గొర్రెలతో గ్రామ శివారులో మంద వేశారు. బుధవారం రాత్రి కురిసిన ఉరుములు, మెరుపుల వానకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పిడుగు శబ్దానికి భయపడి గొర్రెలు రైలు పట్టాలు ఎక్కాయి. అదే సమయంలో గుర్తు తెలియని రైలు ఆ వైపుగా వచ్చి గొర్రెలను ఢీకొట్టింది. దీంతో 38 గొర్రెలు చనిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5లక్షలకుపైగా నష్టం సంభవించి ఉంటుందని తెలిపారు.



మంటల్లో పూరిపాక

పిడుగుపాటు..

సరుబుజ్జిలి: పాతపాడు గ్రామంలోని పున్నాల అప్పారావుకు చెందిన పూరిపాకపై గురువారం పిడుగు పడింది. పిడుగుపాటుకు పాకలో నిల్వ చేసిన టేకు దుంగలు, విలువైన వ్యవసాయ పరికరాలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. నష్టం సుమారు రూ.లక్ష వరకు ఉండవచ్చునని స్థానికుల అంచనా. ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.



కోటబొమ్మాళి: చిట్టివలస పంచాయతీ తులసిపేటలో ఎస్.లక్ష్మణరావుకు చెందిన రెండు ద్విచక్రవాహనాలపై కూలిన రేకుషెడ్డు



పోలాకి: ఈదురుగాలులకు కోడూరు వద్ద చెల్లాచెదురైన కోళ్లఫారం



మరణించిన గొర్రెల వద్ద రోదిస్తున్న గొర్రెల కాపరులు



సంతబొమ్మాళి: మండలంలోని అంట్లవరం వద్ద కూలిపోయిన నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ పాస్ గోడ

క్లుప్తంగా

ఏపీ టిడ్కో డైరెక్టర్‌గా గోవిందరావు


ఖండాపు గోవిందరావు

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఖండాపు గోవిందరావు ఏపీ టిడ్కో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్(ఎంఏయూడీ, విజయవాడ) నుంచి గురువారం ఉత్తర్వులు అందినట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్పీకర్ తమ్మినేని సీతారాంకు, యువనేత తమ్మినేని చిరంజీవినాగ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. గోవిందరావుకు ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహశీల్దార్ ఎస్.రమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు అభినందించారు.

ఏయూ దూరవిద్య పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహించే యు.జి, పి.జి, ప్రొఫెషనల్, డిప్లమా, పీజీ డిప్లమా, కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి సంచాలకులు ఎం.వి.ఎస్ చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2020–21, 2021–22, 2022–23 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందిన వారు 2017–18 విద్యా సంవత్సరం తరువాత చేరి బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.500 అపరాధ రుసుంతో జూన్ 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.andhrauniversity.sde.com, 0891 2844163, 2844164, 2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షల తేదీలు..

డిగ్రీ మూడో సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ మూడో సంవత్సరం పరీక్షలు జూలై 3 నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ద్వితీయ, ఎంబీఏ, ఎంసీఏ, ఇతర పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం పరీక్షలు జూలై 3 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రథమ సంవత్సరం యూజీ, పీజీ, డిప్లమా, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు జూలై 18 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు నిర్వహిస్తారు.

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో హవా


పతకాలు సాధించిన బాడీబిల్డర్లతో ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాడేరులో ఈ నెల 15న జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం నుంచి ప్రాతినిధ్యం వహించిన బిల్డర్లు పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిని గోపాల్ ఫిట్‌నెస్ అధినేత గోపాల్ గురువారం అభినందించారు. 55 కేజీల విభాగంలో ఆరుగుల జ్యోతికుమార్ (శ్రీకాకుళం) ప్రథమ, అబ్దుల్ ఖాన్ (శ్రీకాకుళం) తృతీయ, 65 కేజీల విభాగంలో బట్న నవీన్‌కుమార్ (వప్పంగి) ప్రథమ, 65 కేజీల విభాగంలో షేక్ మదీనా (రణస్థలం) నాలుగో స్థానం, 75 కేజీల విభాగంలో సందీప్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు.

ఇంటర్ సప్లిమెంటరీకి సన్నద్ధం

- 24 నుంచి పరీక్షలు మొదలు
- 86 కేంద్రాలు కేటాయింపు
- హాజరుకానున్న 31,572 మంది విద్యార్థులు


ప్రభుత్వ కళాశాలలో రెమీడియల్ క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 24 నుంచి మొదలుకానున్న పరీక్షల కోసం 86 కేంద్రాలు కేటాయించారు. ఎండల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాలతో రెమీడియల్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

86 కేంద్రాల్లో..

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 31,572 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 20,333 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11,239 మంది ఉన్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు 86 కేంద్రాలను కేటాయించారు.

కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్..

పరీక్షలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల నిర్వహణకు సిబ్బందిని నియమించారు. 86 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 86 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 20 మంది కస్టోడియన్లను నియమిస్తున్నారు. 38 స్టోరేజ్ పాయింట్లతో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. జిల్లా పరిశీలకులు, డీవీఈవో కోట ప్రకాశరావు, డీఈసీ కమిటీ కన్వీనర్‌గా ఆర్ఐవో ఎస్.తవిటినాయుడు, సభ్యులుగా ఇతర సీనియర్ ప్రిన్సిపాళ్లు వ్యవహరిస్తున్నారు. హైపవర్ కమిటీ, రాష్ట్ర పరిశీలకులు హాజరుకానుండగా.. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియామకం చేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేశారు.

రెండు సెషన్లలో..

పరీక్షలను రెండు సెషన్లగా నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రానికి అర గంట ముందు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. అలాగే మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, ఫర్నీచర్, ఇన్విజిలేటర్ల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు



ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈసీ కమిటీ నేతృత్వంలో అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నాం. అధిక ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్ఐఓ, శ్రీకాకుళం

సమస్యల పరిష్కారానికి సహకరించండి


ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నేతలు

నరసన్నపేట: రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని ఏపీ అమరావతి జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు జేఏసీ జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు, మహిళా విభాగం చైర్మన్ ప్రవల్లిక ప్రియ, ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా నేతలు ఏ.సింహాచలం, ఈ.శ్రీనివాసరావు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పి.వేణుగోపాలరావులు గురువారం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు విజ్ఞప్తి చేశారు. జీతాలు ఒకటో తేదీనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల ఎరియర్స్, పీఆర్సీ ఎరియర్స్, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్: కలెక్టర్, చైర్మన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఎంపిక కమిటీ(శ్రీకాకుళం) ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనిట్‌గా పరిగణించి పోస్టులు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 3సార్లు నోటిఫికేషన్ ఇచ్చామని, 4వ సారి రోస్టర్ పాయింట్ మార్చి ఇచ్చినా అర్హత కలిగిన అభ్యర్థులు లభ్యం కానందున ప్రభుత్వ ఆమోదంతో సదరు రోస్టర్ పాయింట్‌లను ఓపెన్ కేటగిరీకి మార్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులు 17, హెల్పర్స్ పోస్టులు 94, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు 12 కలిపి మొత్తం 123 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. అలమాజీపేట సహాయకురాలు పోస్టు హైకోర్టులో కేసు ఉన్న కారణంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. అర్హులైన మహిళా వివాహిత అభ్యర్థులు ఈ నెల 18 నుంచి సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2022 జూలై 1 నాటికి 21–35 మధ్య వయస్సు కలిగి స్థానికులై ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి, సహాయకులు, మినీ అంగన్‌వాడీలకు 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 25 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కర్రసాము పోటీల్లో జగదీష్‌కు స్వర్ణం



పతకం, సర్టిఫికెట్‌తో సీహెచ్ జగదీష్

శ్రీకాకుళం న్యూకాలనీ: కర్రసాము పోటీల్లో జిల్లాకు చెందిన చంచలి జగదీశ్వరరావు సత్తాచాటుతున్నాడు. ఇటీవల బెంగళూరులో వరల్డ్ యూనియన్ సిలంబం (కర్రసాము) ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కర్రసాము పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు పాల్గొనగా అందులో మూడు బంగారం, మూడు రజత, కాంస్య పతకం సాధించారు. వీరిలో జిల్లాకు చెందిన సీహెచ్ జగదీష్ బంగారు పతకంతో మెరిశాడు. ఈయన స్వగ్రామం జలుమూరు మండలం యలమంచిలి. తండ్రి నరసింహమూర్తి రైతు, తల్లి గృహిణి. గత నెలలో కేరళలో జరిగిన జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లోనూ స్వర్ణ పతకం సాధించి శభాష్ అనిపించాడు. బలగ కీర్తిక కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. వీరంతా బల్దేవ్ ఇండియన్ ట్రెడిషినల్ మార్షల్ ఆర్ట్స్ సంస్థలో శిక్షణ పొందుతున్నారు. జగదీష్‌ను జిల్లా క్రీడాధికారులు, ఒలింపిక్, పీఈటీ నాయకులు అభినందించారు.

పారిశ్రామికరంగంలో మహిళలకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

ఎచ్చెర్ల క్యాంపస్ : ఆసక్తి గల స్వయం సహాయక సంఘం మహిళలను పారిశ్రామికరంగంలో ప్రోత్సహించనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ తెలిపారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 750 మంది ఔత్సాహిక స్వయం సహాయ సంఘం మహిళలను గుర్తించి, ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. పూర్తి అవగాహన అనంతరం బ్యాంకు రుణాలు ఇప్పించనున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల వరకు రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పేషెంట్ రిలేషన్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ, బీకాం పాసైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ అందించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీ, సీడాప్ సహకారంతో ఎచ్చెర్లలోని టీటీడీసీలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లల్లోపు వారు అర్హులని తెలిపారు. ఉచిత వసతి, భోజనం, యూనిఫారం, బీమా సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ పాసైన వారికి తొమ్మిది బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో నర్సింగ్, ఎంఎల్‌టీ, బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. వివ రాలకు 9121999654, 7680945357 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఐడీ నంబర్లు కేటాయించండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీ–2002 బాధిత హిందీ పండితుల్లో జీతాలు రాకముందే మరణించిన వారి కుటుంబాలకు లబ్ధిదారుల ఐడీ కేటాయించి 23 నెలల జీతాల చెల్లింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు పిసిని వసంతరావు, సహాధ్యక్షుడు కుప్పన్నగారి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కూన రంగ నాయకులు, ఎస్.రత్నాకర్ కోరారు. ఈ మేరకు గురువారం ఖజానాశాఖాధికారి సీహెచ్.రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. 46 నెలలుగా జీతాలు రాని 39 మంది హిందీ పండితుల్లో 37 మందికి ట్రెజరీ ఐడీలు జారీ అయినా.. విధుల్లో మరణించిన బత్తిని రమణయ్య, జి.శ్యామలరావు కుటుంబాలకు మాత్రం ఐడీల కేటాయింపు జరగలేదని డీడీ దృష్టికి తెచ్చారు. డీఈఓ ఎస్.తిరుమల చైతన్య కూడా ప్రతిపాదనలు పంపారని గుర్తు చేశారు.

రెండు ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోగల సింగన్నపాలెం, ఉప్పినివలస గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై గురువారం ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చయ్యపేటకు చెందిన గంగాడ పుణ్యవతి, ఎర్ర జయమ్మ ఆమదాలవలసలో కూలి పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇదే ఘటనలో తోటవాడకు చెందిన ఆటో డ్రైవర్ జమ్మల రాముకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 ఈఎంటీ బి.పోలినాయుడు, పైలట్ సీహెచ్ మల్లేష్ క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ఆటో బోల్తా..ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని అయోధ్యపురం జాతీయ రహదారి సమీపంలో గురువారం కవిటి నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆటో బోల్తాపడటంతో ఇద్దరు గాయపడ్డారు. కవిటి మండలం దూగానపుట్టుగకు చెందిన నలుగురు వ్యక్తులు ఆటోలో టెక్కలి వస్తుండగా అయోధ్యపురం సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న డి.దేవరాజ్‌కు తీవ్ర గాయాలు కాగా, ఎల్.ఢిల్లేశ్వరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ప్రణీత్‌కుమార్ వైద్యసేవలు అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

ఇచ్ఛాపురం: బెల్లుపడ – ఈదుపురం కూడలిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పలాస నుంచి బరంపురం వైపు ద్విచక్రవాహనంపై ఓ యువకుడు బెల్లుపడ–ఈదుపురం కూడలికి చేరుకునేసరికి ఈదుపురం వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు 108 వాహనంలో ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బరంపురం పెద్దాసుపత్రికి తరలించారు. యువకుడి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పలాసలో గంజాయి మూట కలకలం


గంజాయి మూట

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో గంజాయి మూట పడేసి యువకుడు పరారైన ఘటన గురువారం సంచలనంగా మారింది. సాయంత్రం మూడున్నర గంటలకు బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు పలాస ఆర్టీసీ డిపో ఔట్‌గేటు నుంచి లోపలకు చొరబడి ఇన్‌గేటు వైపు వెళ్తుండగా వాహనం నుంచి ఓ మూట కిందపడింది. దీనిని గమనించిన ఆర్టీసీ సిబ్బంది రవికుమార్ కేకలు వేసినా యువకుడు పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. దీంతో ఆర్టీసీ మేనేజర్ వేదుల శ్రీనివాసరావుకు మూట అందించారు. అందులో దుస్తులతో పాటు మూడు కేజీల మూడువందల నలభై గ్రాముల గంజాయి ఉండటంతో విస్తుపోయారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం?

మందస: మందస పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఎస్ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో గంజాయి అమ్ముతున్న కేంద్రంపై దాడులు చేయగా ఈ వ్యవహారం వెలుగు చూసింది. అయితే పోలీసులు వివరాలను అధికారికంగా వెల్లడించడంలేదు. అంబుగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన మరో ముగ్గురు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం. ఎప్పటి నుంచో ఈ వ్యవహారం గుట్టుగా కొనసాగుతుండగా తాజాగా పోలీసులకు సమాచారం అందినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దాడులు నిర్వహించగా నలుగురు వ్యక్తులతో పాటు కొన్ని కిలోల గంజాయి దొరికినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై మందస ఎస్ఐ వై.రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. గంజాయి దొరికిన విషయం వాస్తవమేనన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800–00
బంగారం(22సి. 10గ్రా.)	56,650–00
వెండి (కిలో)	78,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

సంక్షిప్తంగా..

శుభలేఖలు పంచేందుకు వచ్చి..

- మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి


అల్లు కామేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి వద్ద కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మెళియాపుట్టి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన అల్లు కామేష్ (52) విశాఖపట్నానికి వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఇటీవల కుమారుడికి వివాహం నిశ్చయించిన నేపథ్యంలో శుభలేఖలు పంచడానికి స్వగ్రామం లొద్దభద్ర వచ్చాడు. అక్కడి నుంచి ఈ నెల 16న గొప్పిలి వెళ్లి మద్యం సేవించాడు. మద్యం మత్తులో సమీపంలోని మురుగు కాలువ(గెడ్డ)లో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం, పొదలు నిండి ఉండటంతో ఎవరూ గమనించలేదు. గురువారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం విశాఖపట్నంలో ఉన్న కుటుంబసభ్యులకు విషయం తెలియజేశారు. మృతుని వద్ద ఫోన్ లేకపోవడంతో విషయం తెలియలేదని, గ్రామంలోనే ఉన్నాడనుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పాతపట్నం సీఐ వినోద్ బాబు, ఎస్సై కామేశ్వరరావు, తహశీల్దార్, సరోజిని పరిశీలించారు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీఆర్‌ఏ ఆత్మహత్య


కుంచెల రాంబాబు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ హరిజన గోపాలపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కుంచెల రాంబాబు(33)ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. రాంబాబు ఎ.ఎస్.కవిటి గ్రామ తలయారీగా (వీఆర్‌ఏ)గా పనిచేస్తున్నారు. ఆటో కూడా నడుపుతుంటారు. ఆటోను ఫైనాన్స్‌పై తీసుకుని సకాలంలో డబ్బులు చెల్లించలేకపోవడంతో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని చింతచెట్టుకు గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈయనకు భార్య భారతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వడదెబ్బకు ఉపాధి వేతనదారు మృతి


మృతిచెందిన శాంతమ్మ

ఆమదాలవలస రూరల్: మండలంలోని కలివరం పంచాయతీ పీర్‌సాహెబ్‌పేటకు చెందిన గురుగుబెల్లి శాంతమ్మ(72) గురువారం వడదెబ్బకు గురై మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కంచరాపువానిపేట సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లిన శాంతమ్మ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యలో స్పృహ తప్పి పడిపోయింది. శాంతమ్మ వృద్ధురాలు కావడంతో అందరితో కాకుండా ఇంటికి నెమ్మదిగా రావడంతో తోటి వేతనదారులు ముందుగానే ఇళ్లకు చేరుకున్నారు. ఆలస్యంగా నడుస్తున్న శాంతమ్మ ఎత్తుగా ఉండే పొలం గట్టు ఎక్కే సమయంలో స్పృహ తప్పి పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృతిచెందింది. రెండో పూట ఉపాధి పనుల కోసం వస్తున్న వేతనదారులు శాంతమ్మను గుర్తించి సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. శాంతమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

కోటబొమ్మాళి : మేజర్ పంచాయతీ కోటబొమ్మాళి-1, 2 ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు చౌదరి సునీత, మంచాల స్వాతిలపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం స్థానిక సచివాలయంలో డ్వామా ఏపీడీ కె.లోకేశ్వరరావు, ఎంపీడీఓ నిశ్చ ల, ఏపీఓ హరిప్రసాద్ విచారణ చేపట్టారు. ఉపాధి వేతనదారులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు మాట్లాడుతూ ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే పనులు కేటాయించడంలేదని చెప్పారు. తక్షణ మే వీరిని విధుల నుంచి తొలగించాలని కోరా రు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోయిన కృష్ణారావు, డబ్బీరు ప్రదీప్, కె.అప్ప లరాజురెడ్డి, దాసరి మోహనరావు, ఇర్రి చిరంజీవి పాల్గొన్నారు.